సాక్షి విశాఖపట్నం

గురువారం : 4 : జనవరి : 2024



సావిత్రిబాయి చిరస్మరణీయురాలు

సావిత్రిబాయి పూలే అందరికీ ఆదర్శనీయురాలని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. 8లో



ప్రజారోగ్యానికి రక్ష

జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత విజయవంతంగా కొనసాగుతోంది. బుధవారం 12 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు జరిగాయి. 8లో



రైళ్ల పునరుద్ధరణ

రద్దు చేసిన పలు రైళ్లను ప్రయాణికుల సౌకర్యార్థం పునరుద్ధరిస్తున్నట్లు సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

8 మంది సీఐలకు స్థానచలనం



విశాఖ సిటీ: విశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 8 మంది ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలిగింది. ఇందులో ముగ్గురు సీఐలను రేంజ్‌కు సరెండర్ చేశారు. వీఆర్‌లో ఉన్న నలుగురికి పోస్టింగ్‌లు కల్పించారు. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీసీఎస్-1 సీఐగా ఉన్న సేనం రమేష్ ద్వారకా లా అండ్ ఆర్డర్‌కు బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న సీర భాస్కరరావును కంచరపాలెం లా అండ్ ఆర్డర్‌కు, ఎస్.కాంతారావును నార్త్ ట్రాఫిక్ సర్కిల్‌కు, పి.కోటేశ్వరరావును గాజువాక ట్రాఫిక్ సర్కిల్‌కు, ఎన్.శ్రీనివాసరావును వెస్ట్ క్రైం సబ్ డివిజన్‌లో పోస్టింగ్ ఇచ్చారు. అలాగే కంచరపాలెం లా అండ్ ఆర్డర్ సీఐగా ఉన్న నల్లి సాయి, గాజువాక ట్రాఫిక్ సర్కిల్‌లో ఉన్న ఆర్.సత్యనారాయణరెడ్డి, వెస్ట్ క్రైం సబ్ డివిజన్ సీఐ బి.వి.జగన్నాథరాజులను రేంజ్‌కు సరెండర్ చేశారు.

విశాఖ వ్యాలీ స్కూల్‌లో వసతుల కల్పనకు చర్యలు



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

అరిలోవ: విశాఖ వ్యాలీ స్కూల్‌లో మెరుగైన వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎ.మల్లికార్జున స్కూల్ కమిటీ సభ్యులను ఆదేశించారు. స్కూల్ సమావేశ మందిరంలో బుధవారం ఆయన అధికారులు, పాఠశాల కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. విద్యా సంవత్సరం ప్రారంభంకానున్న నేపథ్యంలో మౌలిక వసతుల కల్పన, అదనపు భవనాల నిర్మాణం, అడ్మిషన్ల ప్రక్రియ, తదితర అంశాలపై చర్చించారు. స్కూల్ ఆవరణలో ప్రస్తుతం చేపడుతున్న ఐకానిక్ భవన నిర్మాణ పనులు తొందరగా పూర్తి చేయించాలని సూచించారు. వీటితోపాటు పాఠశాల బస్సుల ఫిట్‌నెస్ పరీక్షించి, పిల్లల సంఖ్య, ఇతర అవసరాలను దృష్టిలో పెట్టుకొని అవసరమైన కొత్త వాహనాలు సమకూర్చాలని తెలిపారు. డీఈవో ఎల్.చంద్రకళ, ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్, డీటీసీ రాజారత్నం, కమిటీ సభ్యులు ఏఎంఎన్ఎస్ హెచ్ఆర్ హెడ్ డీఎస్ వర్మ, కేంద్రీయ విద్యాలయం వాల్తేరు ప్రిన్సిపాల్ కమల్‌జిత్, విశ్రాంత పోలీస్ అధికారి టి.ఎస్.ఆర్.ప్రసాద్‌తో పాటు ప్రత్యేక ఆహ్వానితులు సీఏ రవిప్రసాద్, వీఎంఆర్‌డీఏ సీఈ శివప్రసాద్ పాల్గొన్నారు.

నేడు ఫిషింగ్ హార్బర్‌లో 10వ సాగర పరిక్రమ కార్యక్రమం

కేంద్ర, రాష్ట్ర మంత్రుల హాజరు

మహారాణిపేట: రాష్ట్ర మత్స్యశాఖ ఆధ్వర్యంలో గురువారం ఫిషింగ్ హార్బర్‌లో 10వ సాగర పరిక్రమ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కేంద్ర మత్స్యశాఖ మంత్రులు పరుషోత్తం రూపాల, ఎల్.మురుగన్, రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ముందుగా హార్బర్‌లో 11వ నంబర్ జెట్టీని పరిశీలిస్తారు. అనంతరం హార్బర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొంటారు. హార్బర్ ఆధునీకరణ పనులు, ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం అమలు, ఫిష్ ఆంధ్రా డొమెస్టిక్ మార్కెట్ పథకం, కిసాన్ క్రెడిట్ కార్డులు, రుణాల పంపిణీ చేస్తారని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్.కె.లాల్ మహ్మద్ తెలిపారు.

6న జిల్లా హాకీ జట్టు ఎంపిక



విశాఖ స్పోర్ట్స్: జిల్లా హాకీ జూనియర్ మెన్ జట్టును ఈ నెల 6న సాలగ్రామపురంలో ఎంపిక చేయనున్నారు. జిల్లా హాకీ సంఘం ఆధ్వర్యంలో ఆ రోజు మూడు గంటలకు ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుంది. 2005 జనవరి 1వ తేదీ తర్వాత జన్మించిన వారు ఎంపికలో పాల్గొనేందుకు అర్హులు. ఎంపికైన జట్టు తిరుపతిలో ఈ నెల 9 నుంచి ప్రారంభంకానున్న స్టేట్ అంతర్ జిల్లాల జూనియర్ మెన్ హాకీ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటుంది.

ఒకరికి కరోనా



మహారాణిపేట: విశాఖలో ఒకరికి కరోనా సోకింది. గడిచిన 24 గంటల్లో 57 మందికి పరీక్షలు చేయగా.. వీరిలో ఒకరికి కరోనా నిర్ధారణ అయింది. 26 మంది హోమ్ ఐసోలేషన్‌లో, ఐదుగురు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. 13 మంది డిశ్చార్జ్ అయ్యారని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఇప్పటి వరకు 44 మందికి కరోనా పాజిటివ్ వచ్చింది.

మురి'పింఛన్'

- జిల్లా వ్యాప్తంగా 1.67 లక్షల మందికి రూ.50.38 కోట్ల పింఛన్ల పంపిణీ
- అవ్వాతాతలకు అండగా సీఎం జగన్
- ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఏకైక నాయకుడు
- ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



మెగా చెక్కును ప్రదర్శిస్తున్న ఎంపీ ఎంవీవీ, మేయర్ హరివెంకటకుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్సీ కల్యాణి, కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

బీచ్ రోడ్డు: 'మీకు నేనున్నాను'అంటూ అవ్వాతాతలకు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చి అండగా నిలిచారని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. వైఎస్సార్ పింఛన్ కానుకను సీఎం వైఎస్ జగన్ రూ.3 వేలకు పెంచడం తెలిసిందే. ఈ సందర్భంగా బుధవారం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో పెంచిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీ ఎంవీవీ మాట్లాడుతూ ఎటువంటి ఆసరా లేని పేదల కష్టాలను చూసి చలించిన సీఎం తన పాదయాత్రలో



వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న ఎంపీ ఎంవీవీ, కలెక్టర్ మల్లికార్జున తదితరులు

ఇచ్చిన హామీని నెరవేరుస్తూ రూ.3 వేలు పింఛన్ అందించడం ప్రశంసనీయమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఏకైక నాయకుడు దేశంలో వైఎస్ జగన్ మాత్రమే అన్నారు. పెంచిన పింఛన్‌తో అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు జీవితాల్లో వెలుగులు వస్తాయన్నారు. గతంలో ఇచ్చిన అరకొర పింఛన్ కోసం కూడా మండుటెండలో పడిగాపులు పడుతూ అందుకోవాల్సి వచ్చేదన్నారు. అందులోనూ కమీషన్లు చెల్లించుకోవాల్సి ఉండేదని, ప్రస్తుతం ఎటువంటి వివక్షకు తావులేకుండా ఒకటో తేదీన వలంటీర్ నేరుగా ఇంటికే వచ్చి పింఛన్ అందిస్తున్నారని చెప్పారు. కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా కేవలం అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను మంజూరు చేస్తున్న ఏకైక సర్కారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనన్నారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చారని, సర్కారు బడుల్లో ఆంగ్ల మాధ్యమాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. ఇటువంటి మంచి కార్యక్రమాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అండగా నిలవాలని కోరారు.

ముందే వచ్చిన సంక్రాంతి

రాష్ట్రంలో అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలకు సంక్రాంతి ముందుగానే వచ్చిందని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. స్వాతంత్య్ర భారత్‌లో ప్రజల కోసం ఇంతలా ఆలోచించిన ముఖ్యమంత్రి ఎవరూ లేరని కొనియాడారు. ప్రతి సంక్షేమ పథకం పేదలను దృష్టిలో పెట్టుకుని ప్రారంభిస్తున్నారని చెప్పారు. పింఛన్ రూ.3 వేలుకు పెంచడంతో వారి సొంత అవసరాలు తీరడంతో పాటు మనవళ్లు, మనవరాళ్లకు ఇవ్వడానికి కూడా ఉపయోగపడతాయన్నారు.

ఇచ్చిన మాట మేరకు పింఛన్ పెంపు

సీఎం వైఎస్ జగన్ తన పాదయాత్రలో ఇచ్చిన మాట మేరకు దశల వారీగా పింఛన్ డబ్బులు పెంచుతూ రూ. 3వేలు చేశారని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. దీంతో పేదలు కూడా సమాజంలో సంతోషంగా జీవించేలా సీఎం భరోసా కల్పించారన్నారు.



బాలయ్యశాస్త్రి లేఅవుట్ వద్ద కొదమంచలి నూకరత్నంకు వితంతువు పింఛన్ అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు



పెందుర్తి నియోజకవర్గం పరవాడ మండలం వెన్నలపాలెంలో లబ్ధిదారులకు రూ.3 వేల పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



పద్మనాభంలో పింఛన్ నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీ వైస్ చైర్మన్ గిరిబాబు, ఎంపీపీ రాంబాబు

కొత్తగా 2,350 మందికి మంజూరు

జిల్లా వ్యాప్తంగా ఈ నెలలో 2,350 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు అయ్యాయని కలెక్టర్ మల్లికార్జున తెలిపారు. దీంతో మెత్తం 1,66,829 మంది సామాజిక పింఛన్లు పొందుతున్నారని, ఇందు కోసం రూ.50.38 కోట్లు వెచ్చిస్తున్నట్టు కలెక్టర్ మల్లికార్జున తెలిపారు. ఈ నెల నుంచి పింఛన్ రూ.3 వేలకు పెంచడంతో జిల్లాలో అదనంగా రూ.3 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. గతంలో రూ.2 వేలు ఉండే పింఛన్‌ను దశల వారీగా రూ.3 వేలకు పెంచామని వివరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, తూర్పు ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, నాయకులు పల్లా దుర్గారావు, పీతల గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

8వ తేదీ వరకు పంపిణీ

మహారాణిపేట: పండగ వాతావరణంలో బుధవారం ప్రారంభమైన వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ ప్రక్రియ ఈ నెల 8వ తేదీ వరకు కొనసాగనుంది. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, చేనేత కార్మికులు, అభయ హస్తం లబ్ధిదారులు, మత్స్యకారులు, ఒంటరి మహిళలు, కల్లుగీత కార్మికులు, హిజ్రాలు, డప్పు కళాకారులు, చర్మకారులు, కిడ్నీ బాధితులు, తదితరులకు సామాజిక పింఛన్‌లు అందజేస్తున్నట్టు డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి శోభారాణి తెలిపారు.

ఆర్థిక భరోసా కలిగింది



భర్త లేని నాకు కుటుంబ పోషణకు ఆర్థిక భరోసా కల్పిస్తూ నాలుగేళ్లుగా పింఛన్ పెంచుకుంటూ వస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు. ఇప్పుడు రూ.3 వేలు కావడంతో మరింతగా భరోసా కలిగింది. దీనికి తోడు చిన్నాచితక పనులు చేసుకుంటూ చింత లేకుండా కుటుంబాన్ని పోషిస్తున్నాను.

– కె.అరుణ, పెదవాల్తేరు

చాలా సంతోషంగా ఉంది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాకు ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ రూ.3 వేలకు పెంచడం చాలా సంతోషంగా ఉంది. నా సొంత ఖర్చుల కోసం చేయి చాచాల్సిన అవసరం లేదు. నా మందులు, ఇతర ఖర్చులకు పోగా ఇంకా నేనే పిల్లలకు తినుబండారాల కోసం డబ్బులు ఇచ్చే స్థితికి చేరుకున్నాను. నా కుటుంబంలో కూడా గౌరవం పెరిగింది. దీని అంతటికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డే కారణం. ఆయనకు రుణపడి ఉంటాం.

– పి.కృష్ణ, లబ్ధిదారు, పేదజాలరిపేట

తిరిగే బాధలు తప్పాయి..



గతంలో ఇచ్చిన అరకొర పింఛన్ కోసం అందరి చుట్టూ తిరిగేవాళ్లం. దాంతో కాళ్ల నొప్పులు వచ్చేవి. ఇప్పుడు ఒకటో తేదీనే తలుపు తట్టి మరి వలంటీరు వచ్చి మా చేతుల్లో పింఛన్ డబ్బులు పెడుతున్నారు. ఇప్పుడు పింఛన్ సొమ్ము రూ.3 వేలకు పెరగడం చాలా ఆనందంగా ఉంది. ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్న ఇటువంటి ముఖ్యమంత్రి మళ్లీ రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– ఎ.రాములమ్మ, హెచ్‌బీ కాలనీ

రూ.3 వేలు పింఛన్ పెద్ద భరోసా



నాకు కాళ్ల నొప్పులు. నడవడానికి ఎంతో ఇబ్బంది పడతాను. పింఛన్ కోసం ఎక్కడికో వెళ్లి అందుకోవాలంటే అది సాధ్యపడని పని. వైఎస్ జగన్ సీఎం అయ్యాక ఆ బాధలు తప్పాయి. ప్రతి నెలా కచ్చితంగా ఒకటో తారీఖున వలంటీరు ఇంటికి వచ్చి పింఛన్ అందివ్వడం పెద్ద భరోసాగా ఉంది. ఇప్పుడు రూ.3 వేలుకు పెంచడం ఎంతో గొప్ప విషయం.

– అల్లిపిల్లి గురువులు, భీమిలి

కొడుకులా ఆదుకుంటున్నాడు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇచ్చిన ప్రకారం పింఛన్‌ను రూ.3 వేలు చేసి అందిస్తున్నారు. ఆయన మాదిరిగా ఏ నాయకుడు చేయలేదు. కన్నబిడ్డలు సైతం ఆదరించని ఈ రోజుల్లో ఒక కొడుకులా ఆదుకుంటున్నాడు. నాలాంటి వృద్ధులకు ఆసరాగా పింఛన్ సొమ్ము అందిస్తున్న జగన్ బాబును ఎన్నటికీ మరువం.

– తౌడమ్మ, నెహ్రూ నగర్

ఇంటికే పింఛన్ అందిస్తున్నారు



గతంలో పింఛన్ కోసం రోజుల తరబడి తిరిగేవాళ్లం. జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తెలతెలవారగానే వలంటీరు ఇంటికి తెచ్చి పింఛను సొమ్ము అందిస్తున్నారు. గత ప్రభుత్వంలో పంచాయతీ కార్యాలయాల వద్ద పింఛన్ల కోసం పడిగాపులు కాసేవారం. జగనన్న వచ్చిన తర్వాత అవ్వాతాతలు, మా లాంటి దివ్యాంగులకు కష్టాలు తీరాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటా.

– కంబాల మసేను, దివ్యాంగుడు, జాలరిపేట

భూ ఆక్రమణదారులపై ఉక్కుపాదం

- కబ్జాలకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్
- స్పందన, డయల్ యువర్ సీపీకి భూ ఆక్రమణలపై అత్యధిక ఫిర్యాదులు
- చర్యలకు ఉపక్రమిస్తున్న సీపీ రవిశంకర్

విశాఖ సిటీ: భూ ఆక్రమణదారులు, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న వారితో కఠినంగా వ్యవహరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ నిర్ణయించారు. రాజకీయ నాయకుల పేర్లు చెప్పి నగరంలో భూకబ్జాలకు పాల్పడిన, ఇళ్లలో అద్దెకు దిగి వాటిని ఆక్రమించుకోడానికి ప్రయత్నించిన వారిని ఉపేక్షించవద్దని పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ భూములతోపాటు ప్రైవేటు వ్యక్తులు, సంస్థలకు చెందిన జిరాయితీ స్థలాలను కూడా ఆక్రమణదారులు విడిచిపెట్టడం లేదు. ఆ స్థలాలకు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి రాజకీయ నాయకులు, కొంత మంది పెద్దల పేర్లు చెప్పి కాజేసే ప్రయత్నాలు చేస్తున్నారు. వీరికి కొంత మంది ప్రభుత్వ అధికారులతోపాటు పోలీసులు, న్యాయవాదులు అండగా నిలుస్తున్నారు. దీంతో యజమానులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. చివరకు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఇటువంటి ఫిర్యాదులు ఎక్కువవుతుండడంతో కబ్జాదారులు, వారికి సహకరించిన వారిపై కఠినంగా వ్యవహరించేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. భూ కబ్జాలకు పాల్పడిన వారిని ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ (ప్రొహిబిషన్) యాక్ట్, 1982 ప్రకారం పీడీ యాక్ట్ కింద అరెస్టు చేయడంతోపాటు అవసరమైతే నగర బహిష్కరణ కూడా విధించాలని నిర్ణయించారు. అదేవిధంగా ఒంటరి మహిళలు, వితంతువులు, వృద్ధులు, పిల్లలు దూరంగా ఉన్న తల్లిదండ్రులు, ఎటువంటి ఆసరా లేని ఒంటరి కుటుంబాల భూములు, ఆస్తుల కబ్జాకు గానీ, మోసం చేయడానికి గానీ ప్రయత్నించినా, వారికి సహకరించినా వారిపై మరింత కఠినంగా చర్యలు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాలు జారీ చేశారు. అలాగే కబ్జాదారులకు సహకరించే పోలీసులు, అడ్వకేట్లు, రిటైర్డ్ తహసీల్దార్లు, వీఆర్వోలు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులపైనా విచారణ జరిపి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇప్పటికే భూకబ్జాలకు పాల్పడుతున్న వారిని, అద్దె ఇళ్ల దురాక్రమణదారులను, ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించిన ముఠాలను పోలీసులు గుర్తించారు. వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. వారికి సహకరించే వారిపై నిఘా పెడుతున్నారు. ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని సీపీ హెచ్చరించారు.

పరీక్షా పే చర్చలో భాగస్వాములవ్వాలి

విశాఖ విద్య: పరీక్ష పే చర్చలో ఉపాధ్యాయులు, విద్యార్థులు భాగస్వాములవ్వాలని ప్రభుత్వ బీఈడీ కళాశాల సీనియర్ అధ్యాపకుడు గొట్టేటి రవి అన్నారు. బుధవారం ఆయన కేడీపీఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. ప్రధాని దేశ విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న పరీక్షా పే చర్చలో ఉపాధ్యాయులు, విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు పాల్గొనాలన్నారు. ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసే విధానాన్ని ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్‌లో ఉపాధ్యాయులకు వివరించారు. పాఠశాలలో ఇప్పటి వరకు 152 మంది ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ కావడంపై అభినందించారు.

ఎంచుకున్న రంగంపై పట్టు అవసరం

ఐఆర్ఎస్ అధికారి ఈదరి రవికిరణ్

మధురవాడ: విద్యార్థులు చదువుతోపాటు ఇష్టమైన రంగంపై పట్టు సాధించాలని ఐఆర్ఎస్ అధికారి, కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ ట్యాక్స్ అండ్ నార్కోటిక్స్ నేషనల్ అకాడమీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఈదరి రవికిరణ్ సూచించారు. బుధవారం సాయంత్రం చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలకు సంసిద్ధత, 21వ శతాబ్దంలో అవసరమైన స్కిల్స్, కెరీర్ గైడెన్స్, తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉపన్యాసంతో పాటు వేణుగానం విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంది. మాతృభాషపై పట్టు సాధిస్తే అన్ని భాషలూ సులువుగా నేర్చుకోవచ్చున్నారు. డబ్బు సంపాదనే ధ్యేయంగా ప్రస్తుత సమాజం ముందుకు సాగుతోందన్నారు. విద్యార్థులు మంచి భావవ్యక్తీకరణ, ప్రశ్నించేతత్వం అలవాటు చేసుకోవాలన్నారు. సమాజంలో అన్ని అంశాలనూ తెలుసుకోవాలన్నారు. నేర్చుకోవాలనే తపన, కృషి ఉంటే ఏమైనా నేర్చుకోవచ్చనీ... అన్నింటికీ గురువే వుండాల్సిన అవసరం లేదన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజబాబు, ఉపాధ్యాయుడు సోమేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.



ఫ్లూటు ఊదుతున్న ఐఆర్ఎస్ రవికిరణ్

ఆఖిరి గురువారం పూజలకు ఏర్పాట్లు



విశేష పూజలో సిరులతల్లి

కనకమహాలక్ష్మి దర్శనానికి పోటెత్తిన భక్తులు

దాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా 21వ రోజు బుధవారం సిరులతల్లిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. 3 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈవో కె.శిరీష, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పూజలు

శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో మార్గశిర మాసం ఆఖరి గురువారం పూజలు బుధవారం అర్ధరాత్రి శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ సంప్రదాయం ప్రకారం వేదమంత్రాలు, నాదస్వరాలతో గణపతి పూజ అనంతరం అమ్మవారికి విశేష పూజలు చేశారు. పరిసర ప్రాంత ప్రజలు తీసుకొచ్చిన పసుపు నీళ్లతో అమ్మవారిని అభిషేకించారు. పెద్ద ఎత్తున క్షీరాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారికి పసుపు పూశారు. ప్రత్యేక పూజలు అనంతరం అమ్మవారిని స్వర్ణాభరణాలతో అలంకరించి, అర్ధ రాత్రి 12.05 నుంచి 1.30 గంటల వరకు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం వెండి కవచం తొడిగారు. ఆలయ ఈవో కె.శిరీష, ప్రధానార్చకుడు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనప్రాప్తి కల్పించారు.

- రీడింగ్ రూమ్ వద్ద ధర్మదర్శనంతో పాటు రూ.100, రూ.200, రూ.500 క్యూ టికెట్లు ఇస్తారు. సీతారామస్వామి ఆలయం వైపు నుంచి వీవీఐపీ, వీఐపీతో పాటు వృద్ధులు, వికలాంగులు, రూ.200, రూ.500 టికెట్ తీసుకున్న వారికి దర్శనం కల్పించనున్నారు. అమ్మవారి ఆలయ వెనుకభాగం, ఆలయ ప్రధాన ద్వారం(వీటీ కాలేజ్ వద్ద), దర్శనం అనంతరం బయటకు వచ్చే మార్గంలో ప్రసాద కౌంటర్లు ఏర్పాటు చేశారు.

రేపటి నుంచి ఆంధ్రా,బెంగాల్ రంజీ మ్యాచ్

విశాఖ స్పోర్ట్స్: రంజీ మ్యాచ్‌లో భాగంగా ఈ నెల 5వ తేదీ నుంచి బెంగాల్ జట్టుతో ఆంధ్రా మెన్ జట్టు వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదికగా తలపడనుంది. ఎలైట్ బీ గ్రూప్‌లో జరగనున్న ఈ మ్యాచ్ ఉదయం 9.30 గంటలకు ప్రారంభం కానుందని ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథరెడ్డి తెలిపారు. నాలుగు రోజుల పాటు ఈ మ్యాచ్ జరగనుండగా.. ఇరు జట్లు స్టేడియం బీ గ్రౌండ్ నెట్స్‌లో బుధవారం ప్రాక్టీస్ చేశాయి. గురువారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ఆంధ్రా జట్టు, 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు బెంగాల్ జట్టు ప్రాక్టీస్ చేయనుందని తెలిపారు.

సెయిల్, విశాఖ ఉక్కు విలీనంపై ప్రధానికి లేఖ

ఉక్కునగరం: సెయిల్, విశాఖ స్టీల్‌ప్లాంట్ విలీనంపై ప్రధాని మోదీ తక్షణం జోక్యం చేసుకోవాలని నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆఫీసర్స్ అసోసియేషన్(ఎన్‌సీవోఏ) సెక్రటరీ జనరల్ వి.కె.తోమర్ కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ప్రధానికి లేఖ రాశారు. జాతీయ ఆర్థిక వ్యవస్థ వృద్ధిలో ఉక్కు పరిశ్రమ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఈ రెండు సంస్థల విలీనం వ్యూహాత్మక ఆవశ్యకత మాత్రమే కాకుండా, రెండింటికీ ఉపయోగకరమన్నారు. సెయిల్‌కు ఓడరేవు ఆధారిత కర్మాగారం తోడైతే గణనీయమైన ల్యాండ్ బ్యాంక్, మెరుగైన లాజిస్టిక్స్‌తో టన్నుకు నాలుగైదు వేల లాభం చేకూరుతుందన్నారు. విలీనం ద్వారా స్టీల్‌ప్లాంట్‌కు మెరుగైన ఖనిజ భద్రతతో పాటు టన్నుకు రూ.4 వేలు నుంచి రూ.10 వేలు లాభం వస్తుందన్నారు. సెయిల్ ఇప్పటికే 35 శాతం పెట్టుబడుల ఉపసంహరణ చేసిందని, ఈ విలీనంతో పెట్టుబడుల ఉపసంహరణ విధానం సజావుగా సాగుతుందన్నారు.

ప్రజారోగ్యానికి రక్ష

- విజయవంతంగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు
- బుధవారం 4,822 మందికి సేవలు


బుచ్చిరాజుపాలెంలో కంటి పరీక్ష చేస్తున్న వైద్యురాలు


అక్కయ్యపాలెంలో దంత పరీక్ష చేస్తూ..


మధురవాడ గణేష్‌నగర్‌లో మందులు అందిస్తున్న సిబ్బంది

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత విజయవంతంగా కొనసాగుతోంది. అర్బన్ పరిధిలో బుధవారం 12 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. తోటవీధి(భీమిలి), చినముషిడివాడ, బుచ్చిరాజుపాలెం, గాజువాక, దేవాడ, ఏకేసీ కాలనీ, అంబేడ్కర్ కాలనీ, రైల్వే న్యూకాలనీ, కొబ్బరితోట, ఎన్‌జీజీవో కాలనీ, స్వతంత్ర నగర్‌లో నిర్వహించిన శిబిరాల్లో 4,822 మందికి వైద్య సేవలు అందించారు. ఇందులో 22 మందిని వివిధ కార్పొరేట్ ఆస్పత్రులకు సిఫారసు చేసినట్లు డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు. కణితి, ఏఎస్‌ఆర్ నగర్(2), భానోజీనగర్, బుచ్చిరాజుపాలెం(3), జ్ఞానాపురం, మిధిలాపురి వుడా కాలనీ, నరవ, పాత రేసవానిపాలెం(స్వర్ణభారతి), పిఠాపురం కాలనీ, ప్రసాద్‌గార్డెన్స్‌లో గురువారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్‌వో వెల్లడించారు.

ప్రాణం తీసిన స్పీడ్ బ్రేకర్

- ఆటో బోల్తా.. డ్రైవర్ దుర్మరణం
- పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబం


గండ్రెడ్డి నరిసింగరావు (ఫైల్)


మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య జ్యోతి, కుటుంబ సభ్యులు

ఆనందపురం: మామిడిలోవ వద్ద ఆరులేన్ల జాతీయ రహదారిపై స్పీడ్ బ్రేకర్ వద్ద ఆటో బోల్తా పడింది. సంఘటన స్థలంలోనే డ్రైవర్ దుర్మరణం చెందాడు. ఎస్ఐ గంట్యాడ సంతోష్ తెలిపిన వివరాలివీ.. గండిగుండం గ్రామానికి చెందిన గండ్రెడ్డి నరిసింగరావు(38) ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. నరిసింగరావు బుధవారం శొంఠ్యాం నుంచి ఆటో నడుపుకుంటూ గండిగుండం వైపు వస్తున్నాడు. ఆ ఆటో మామిడిలోవ వద్దకు చేరుకునే సరికి అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో నరిసింగరావుకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ సమయంలో ఆటోలో ప్రయాణికులెవరూ లేరు. అతనికి భార్య జ్యోతి, కుమార్తె జ్యోత్స్న(4) ఉన్నారు. అతని కుమారుడు మనోజ్ (12) అనారోగ్యంతో రెండేళ్ల కిందట మృతి చెందాడు. అతని తల్లిదండ్రులు కూడా మరణించారు. కేవలం నరిసింగరావు సంపాదనపైనే ఆధారపడి జీవిస్తున్న భార్య జ్యోతి, కుమార్తె జ్యోత్స్న దిక్కులేనివారయ్యారు. ప్రమాద విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని నరిసింగరావు మృతదేహం వద్ద బోరున విలపించారు. భార్య జ్యోతి రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. ఎస్ఐ గంట్యాడ సంతోష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు కుటుంబ సభ్యులను గండిగుండం సర్పంచ్ గండ్రెడ్డి శ్రీనివాస్ పరామర్శించి ఓదార్చారు.

స్పీడ్ బ్రేకర్ వల్లే ప్రమాదాలు

మామిడిలోవ వద్ద ఆరు లేన్ల రహదారి సర్వీసు రోడ్డు పై ఉన్న స్పీడ్ బ్రేకర్ ప్రమాదకరంగా మారింది. అక్కడ సమాంతరంగా కాకుండా ఎగుడు దిగుడుగా ఏర్పాటు చేయడంతో పాటు వాటిపై జీబ్రా లైన్లు ఏర్పాటు చేయలేదు. దీంతో వాహన చోదకులు దగ్గరకు వచ్చే వరకు స్పీడ్ బ్రేకర్ కనిపించని పరిస్థితి నెలకొంది. దగ్గరకు వచ్చిన అనంతరం అకస్మాత్తుగా వాహనాలకు బ్రేక్‌లు వేస్తుండడంతో అదుపు తప్పి బోల్తా పడుతున్నాయి. ఇక్కడ ఇలా ప్రమాదాలు జరిగి ఐదుగురు ప్రాణాలు కోల్పోయినట్టు స్థానికులు చెబుతున్నారు. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకుని ప్రమాదాలను నివారించాలని పలువురు కోరుతున్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

ఆరిలోవ: మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జీవీఎంసీ 12వ వార్డు సందరయ్య కాలనీలో తల్లిదండ్రులతో నివాసముంటున్న తమ్మినేని ప్రవీణ్‌కుమార్(19) ఇటీవల పాలిటెక్నిక్ పూర్తి చేశాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో ఉద్యోగం చేయాలని నిర్ణయించుకున్నాడు. కానీ తల్లిదండ్రులు మాత్రం ఇంజినీరింగ్ చదువుకోవాలని సూచించారు. దీనిపై కుటుంబ సభ్యుల మధ్య కొద్ది రోజులుగా చర్చ జరుగుతుంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి బయటకు వెళ్లిన ప్రవీణ్ బుధవారం ఉదయం తిరిగి వచ్చాడు. దీనిపై తల్లి కృష్ణవేణి మందలించింది. అనంతరం ఆమె ఆరిలోవలో తాను పనిచేస్తున్న ప్రైవేట్ స్కూల్‌కు వెళ్లిపోయారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఒంటరిగా ఉన్న ప్రవీణ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కృష్ణవేణి స్కూల్ నుంచి మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూసేసరికి ఫ్యాన్‌కు వేలాడుతూ కొన ఊపిరితో ప్రవీణ్ కనిపించాడు. వెంటనే స్థానికుల సహాయంతో కిందకి దింపి ఆటోలో విమ్స్‌కు తరలించారు. అక్కడికి వెళ్లిన కొద్ది సేపటికే చికిత్స పొందుతూ ఆయన ప్రాణాలు విడిచాడు. మృతుడు తండ్రి ఆదినారాయణ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మృతుడి అక్క బీఫార్మసీ చదువుతోంది. కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్ మార్చురీకి తరలించారు.

మైనర్‌తో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

కూర్మన్నపాలెం: మైనర్ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ వ్యక్తిపై దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అగనంపూడి దరి గల్లవానిపాలెం ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో గత నెల 31న రాత్రి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఆ సమయంలో పక్క అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న చాగంటి ప్రసాదరావు(58) అక్కడికి వచ్చి అందరూ ఆటపాటల్లో ఉన్న సమయంలో ఏడేళ్ల బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. వేడుకల అనంతరం ఆ చిన్నారి తన తల్లిదండ్రులకు జరిగిన విషయాన్ని చెప్పింది. దీంతో వారు సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించి, ప్రసాదరావు అసభ్యకరంగా ప్రవర్తించినట్లు గుర్తించారు. ఈ మేరకు బుధవారం దువ్వాడ పోలీసులకు బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆదర్శప్రాయుడు స్పీకర్ తమ్మినేని

జీసీల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్మోహన్‌రావు


తమ్మినేని సీతారాంను సత్కరిస్తున్న బీసీల సమాఖ్య ప్రధాన కార్యదర్శి రామ్మోహనరావు

తాటిచెట్లపాలెం: నాలుగు దశాబ్దాలుగా రాష్ట్ర ప్రగతి, సంక్షోభ సమయాల్లో అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం నిర్వహించిన పాత్ర, ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించిన తీరు నేటి సమాజంలో అందరికీ ఆదర్శప్రాయమని అఖిల భారత వెనుకబడిన తరగతుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పప్పల రామ్మోహన్‌రావు అన్నారు. సమాఖ్య ఆధ్వర్యంలో మాధవధారలోని మాధవస్వామి కల్యాణ మండపంలో శాసనసభా స్పీకర్ తమ్మినేనికి బుధవారం రాత్రి పౌర సన్మానం చేశారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ తమ్మినేని సుదీర్ఘ రాజకీయ ప్రయాణాన్ని, సేవలను గుర్తిస్తూ సమాఖ్య, అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం తరఫున సత్కరించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పాలన విధానాన్ని, ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తమ్మినేని నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు, కార్పొరేటర్లు వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, ఏపీ చైల్డ్ రైట్స్ కమిషన్ మెంబర్ సీతారాం, వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు పేడాడ రమణికుమారి, ఖారవేల అసోసియేషన్ అధ్యక్షుడు పేడాడ నరసింగరావు, జనసేన నాయకుడు బొడ్డేపల్లి రఘు,తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కథా నాటిక పోటీలు

సీతంపేట: అజోవిభో కందాళం ఫౌండేషన్, రైటర్స్ అకాడమీ సంయుక్తంగా ఈ నెల 4 నుంచి 7 వరకు కళాభారతిలో విశిష్ట పురస్కారాలు, సాహితీ సాంస్కృతిక సదస్సులు, కథా నాటిక పోటీలు నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం కమిటీ చైర్మన్ వి.వి.రమణమూర్తి తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 10.30 గంటల వరకు మూడు నాటికలు ప్రదర్శిస్తారని తెలిపారు. అజోవిభో కందాళం సంస్థ వ్యవస్థాపకుడు అప్పాజోస్యుల సత్యనారాయణ మాట్లాడుతూ సంస్థ 31వ వార్షికోత్సవం సందర్భంగా 29 నాటికలు ఎంట్రీలుగా వచ్చాయని, వాటిలో 9 ఎంపిక చేశామన్నారు. కువైట్‌స్వామి, మీసాల నాయుడు, మేడా మస్తాన్‌రెడ్డి, వర్రే నాంచారయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల మందు పార్టీపై నివేదిక ఇవ్వండి

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశం

విశాఖ విద్య: అనకాపల్లి జిల్లా చోడవరం పట్టణంలోని వసతి గృహంలో ఉంటున్న 6, 7, 10 తరగతులకు చెందిన 16 మంది విద్యార్థులు ఇటీవల మందు పార్టీ చేసుకున్న ఘటనను రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. ఈ వ్యవహారంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కమిషన్ సభ్యుడు డాక్టర్ గొండు సీతారాం బీసీ సంక్షేమ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నివేదిక ఆధారంగా చట్ట ప్రకారం చర్యలకు సిఫారసు చేస్తామని ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల జీవితాలతో ముడిపడి ఉన్న వివిధ అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ విషయంపై అన్ని జిల్లాల ఉన్నతాధికారులకు కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు నేతృత్వంలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. వీటిని ఉల్లంఘించే అధికారులను కమిషన్ ఉపేక్షించదన్నారు.

సావిత్రిబాయి పూలే చిరస్మరణీయురాలు


సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

కొమ్మాది: మహిళలకు విద్య ఆవశ్యకతను తెలియజేయడంతో పాటు ఆ బాటలో నడిచేలా స్ఫూర్తిని కలిగించిన సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అందరికీ ఆదర్శనీయమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు అన్నారు. ఎండాడలోని పార్టీ కార్యాలయంలో బుధవారం సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి కోలా గురువులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు పిల్లా సుజాత సత్యనారాయణ, ముదండి రాజేశ్వరి, మాధవీవర్మ, అల్లంపల్లి రాజబాబు, అడ్డాల కృపాజ్యోతి, ఈశ్వరరావు, రాములప్పడు, శ్రీదేవివర్మ, రఘు, రమేష్, వెంకట్రావు పాల్గొన్నారు.

ఆరిలోవ: రాష్ట్ర బీసీ సంఘం ఉపాధ్యక్షుడు కె.రామన్నపాత్రుడు నేతృత్వంలో ఇందిరానగర్ ఎస్ఐజీ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో సావిత్రిబాయి చిత్రపటానికి మేయర్ హరి వెంకటకుమారి, ఎంపీ ఎంవీవీ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

ప్రసాద్ పథకం పనులకు త్వరలో శ్రీకారం

- భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి
- సింహగిరిపై తాత్కాలిక షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం


తాత్కాలిక షాపింగ్ కాంప్లెక్స్‌ని ప్రారంభిస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ప్రసాద్ పథకం పనులకు త్వరలో శ్రీకారం చుట్టనున్నట్టు మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. సింహగిరిపై వర్తకులకు రూ.35 లక్షలతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షాపింగ్ కాంప్లెక్స్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి విలేకరులతో మాట్లాడుతూ దేవస్థానంలో జరిగే పలు అభివృద్ధి పనులకు వారం, పది రోజుల్లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేస్తామన్నారు. ఈ పథకం కింద సింహగిరిపై ఆధునిక షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కూడా చేపడతామన్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌ను తొలగించామన్నారు. దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి, ట్రస్ట్ బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, పిల్లా కృష్ణమూర్తిపాత్రుడు, ఈతలు శ్రీనివాసరాజు, రాంబాబు, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి స్వామి, సింహగిరి వర్తక సంఘం అధ్యక్షుడు ముగ్గు కిరణ్ పాల్గొన్నారు.

రద్దు చేసిన రైళ్ల పునరుద్ధరణ

తాటిచెట్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే పరిధిలో జరుగుతున్న పనుల నిమిత్తం రద్దు చేసిన పలు రైళ్లను ప్రయాణికుల సౌకర్యార్థం పునరుద్ధరిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి తెలిపారు.

పునరుద్ధరించిన రైళ్లు

- విజయవాడ-విశాఖపట్నం-విజయవాడ(22702/22701) ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 5 నుంచి 13వ తేదీ వరకు షెడ్యూల్ ప్రకారం ఆయా రోజుల్లో నడుస్తుంది.
- గుంటూరు-విశాఖపట్నం(17239) సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు నడుస్తుంది.
- విశాఖపట్నం-గుంటూరు(172400 సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు నడుస్తుంది.

సికింద్రాబాద్-బ్రహ్మపూర్ మధ్య మరో సంక్రాంతి స్పెషల్

పండగ వేళ సికింద్రాబాద్-బ్రహ్మపూర్-సికింద్రాబాద్ మధ్య మరో సంక్రాంతి స్పెషల్ రైలును నడుపుతున్నట్లు సీనియర్ డీసీఎం తెలిపారు. సికింద్రాబాద్-బ్రహ్మపూర్(07093) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 8, 15 తేదీల్లో సికింద్రాబాద్‌లో రాత్రి 7.45 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 5.45 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. ఇక్కడ నుంచి 5.47 గంటలకు బయలుదేరి అదే రోజు ఉదయం 11.15 గంటలకు బ్రహ్మపూర్ వెళ్తుంది. బ్రహ్మపూర్-సికింద్రాబాద్(07094) స్పెషల్ రైలు ఈ నెల 9, 16వ తేదీల్లో బ్రహ్మపూర్‌లో మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరి అదే రోజు సాయంత్రం 5.10 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. ఇక్కడి నుంచి 5.12 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు సికింద్రాబాద్ వెళ్తుంది.

కన్యాకుమారి-డిబ్రూఘడ్ రీ షెడ్యూల్

కన్యాకుమారిలో బుధవారం సాయంత్రం 5.25 గంటలకు బయలుదేరాల్సిన కన్యాకుమారి-డిబ్రూగడ్(22503) ఎక్స్‌ప్రెస్.. లింక్ రైలు ఆలస్యం కారణంగా సుమారు నాలుగు గంటలు ఆలస్యంగా రాత్రి 9.30 గంటలకు బయలుదేరింది. అంతే ఆలస్యంగా ఆయా స్టేషన్లకు ఈ రైలు చేరుకోనుంది.

నేడు సంత్రగచ్చి వరకే అమరావతి ఎక్స్‌ప్రెస్

వాస్కోడగమాలో ఈ నెల 2వ తేదీన బయలుదేరిన వాస్కోడగామా-షాలిమర్(18048) అమరావతి ఎక్స్‌ప్రెస్ భద్రతా పనుల కారణంగా గురువారం సంత్రగచ్చి వరకే నడుస్తుందని రైల్వే అధికారులు తెలిపారు.

బాలికపై లైంగిక దాడికి యత్నం

వైద్యుడిపై కేసు నమోదు

అల్లిపురం: బాలికపై లైంగిక దాడికి యత్నించిన డాక్టర్‌పై మహారాణిపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ బి.రమణమూర్తి తెలిపిన వివరాలివీ.. అనకాపల్లి జిల్లాకు చెందిన ఓ మహిళ బ్రాండిక్స్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ తన 15 ఏళ్ల కుమార్తెను నగరంలో ఓ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేర్పించింది. ఈమె భర్తకు దూరంగా ఉంటోంది. బాలిక ఎస్సీ బాలికల హాస్టల్‌లో ఉండి చదువుకుంటోంది. తనకు పరిచయం ఉన్న రెడ్డి సూర్యారావు అనే వ్యక్తికి తన కూతురి చదువు విషయం తెలియజేసి, జాగ్రత్తగా చూసుకోమని చెప్పింది. బాలిక చదువుకుంటూ పార్ట్ టైమ్ జాబ్ చేసేందుకు సూర్యారావు రామాటాకీస్ వద్ద గల రుక్మం భవానీశంకర్‌కు చెందిన శుభం ప్రేమ ఆస్పత్రిలో జాయిన్ చేశాడు. గత నవంబర్ 19వ తేదీ రాత్రి 7.30 గంటల ప్రాంతంలో సూర్యారావు బాలికకు ఫోన్ చేసి డబ్బు తీసుకునేందుకు నోవాటెల్ దగ్గర ఉన్న భవానీశంకర్ గెస్ట్ హౌస్‌కు రావాలని చెప్పాడు. దీంతో ఆమె అక్కడికి వెళ్లింది. ఆమెను బలవంతంగా గదిలోకి నెట్టి అతను బయట నుంచి తలుపు వేశాడు. అప్పటికే గదిలోనే ఉన్న భవానీ శంకర్.. బాలికను కోరిక తీర్చమని బలవంతం చేశాడు. పెనుగులాడి ఆమె తప్పించుకుని బయటకు వెళ్లేందుకు ప్రయత్నించగా సూర్యారావు మళ్లీ లోపలికి నెట్టి వేశాడు. ఆమెను కులం పేరుతో దూషించాడు. చివరికి ఆమె అక్కడ నుంచి తప్పించుకుని తన తల్లి దగ్గరకు వెళ్లి విషయం తెలియజేసింది. బాలిక తల్లి, కుమార్తెను తీసుకుని బుధవారం మహారాణిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులపై పోక్సో కేసు, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు కుంగింది


రామ్‌నగర్‌లో కుంగిన రోడ్డు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 28వ వార్డు పరిధి రామ్‌నగర్‌లో బుధవారం రోడ్డు కుంగింది. దీంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. అటుగా ప్రయాణించే వాహనచోదకులు, పాదాచారులు ఇబ్బంది పడ్డారు. దీనిపై జీవీఎంసీ ఆఫీస్ ఇన్‌చార్జి సత్యనారాయణ మాట్లాడుతూ నాలుగు రోజుల కిందట అక్కడ పైపులైన్ లీక్ అయిందని తెలిపారు. ఈ కారణంగా రోడ్డు కుంగిందని చెప్పారు. వీలైనంత త్వరగా మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు.

డిమాండ్‌లు పరిష్కరించే వరకూ ఉద్యమం


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు

మహారాణిపేట: తమ డిమాండ్‌లు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు తలపెట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా బుధవారం చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించిన ఆందోళనకారులను పోలీసులు అడ్డుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.దేవి మాట్లాడుతూ ప్రభుత్వం దిగి వచ్చి డిమాండ్‌లు పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు. సీపీఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్, యూనియన్ గౌరవ సలహాదారు బృందావతి, గౌరవ అధ్యక్షురాలు పి.మణి, అధ్యక్షురాలు వై.తులసి, తదితరులు పాల్గొన్నారు.

పందుల వేటకు వెళ్తూ గన్ మిస్‌ఫైర్

- స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుడు దుర్మరణం
- పోలీసుల అదుపులో రెండో వ్యక్తి


సంఘటనా స్థలంలో పైడిరాజు మృతదేహం

ఉక్కునగరం: పందుల వేటకు వెళ్తూ కంట్రీ మేడ్ గన్ మిస్‌ఫైర్ అయి ఓ కాంట్రాక్ట్ కార్మికుడు దుర్మరణం చెందిన ఘటన స్టీల్‌ప్లాంట్ సెక్టార్-12 కూడలిలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్టీల్‌ప్లాంట్ పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. అగనంపూడి పినమడక కాలనీకి చెందిన కడవల పైడిరాజు(38) స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్-2 విభాగంలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఖాళీ సమయంలో అడవి పందులు, చెవుల పిల్లిల వేటకు వెళ్లే అలవాటు ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. బుధవారం ఉదయం షిఫ్ట్ విధులకు వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి వచ్చాడు. సాయంత్రం తనతో వేటకు వచ్చే పాడుగు సాయిసాగర్(23)తో బైక్‌పై టౌన్‌షిప్ బయల్దేరాడు. పైడిరాజు బైక్ నడుపుతుండగా.. పొడవాటి కంట్రీ మేడ్ గన్‌ను బండి హ్యాండిల్ కింద నుంచి వెనుక ఉన్న సాయిసాగర్ పట్టుకున్నాడు. సెక్టార్-12 కూడలి వద్దకు వచ్చేసరికి బైక్ కుదుపులకు అప్పటికే లోడ్ చేసి ఉన్న గన్ కిందకు జారుతుండగా పట్టుకునే క్రమంలో ట్రిగ్గర్ తగిలి బులెట్ పైడిరాజు గుండె కింది భాగంలోకి దూసుకుపోయింది. దీంతో వెనక కూర్చున్న సాయిసాగర్ భయంతో ఆ తుపాకి భాగాలను దగ్గరలో ఉన్న పొదల్లో విసిరి బైక్‌తో పారిపోయాడు. సంఘటన విషయం తెలుసుకున్న స్టీల్ ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు నేతృత్వంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వేట విషయం బయటకు రావడం, వెనక వెళ్లిన సాగర్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించడంతో అసలు విషయం బయట పడింది. నిజంగా మిస్ ఫైర్ అయిందా? లేదా సాగర్ కావాలని చేశాడా? అని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. డీసీపీ కె.ఆనందరెడ్డి, సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

మత్స్యజీవుల మృత్యువాత


తీరానికి కొట్టుకుని వచ్చిన డాల్ఫిన్, తాబేలు కళేబరాలు

కొమ్మాది: మంగమారిపేట దరి రామాద్రి తీరానికి బుధవారం భారీ డాల్ఫిన్, తాబేలు కళేబరాలు కొట్టుకొచ్చాయి. ఇక్కడ సమీపంలోని పలు సీఫుడ్స్ కంపెనీల నుంచి విడుదలవుతున్న రసాయన వ్యర్థాలు నేరుగా సముద్రంలో కలపడంతో ఇలా మృత్యువాత పడుతున్నాయని పలువురు ఆవేదన చెందుతున్నారు. అరుదుగా కనిపించే డాల్ఫిన్స్ మృత్యువాత పడటం బాధాకరమని పేర్కొన్నారు.